సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 5 । ఆగస్టు । 2024



శ్రావణం..శుభప్రదం

నేటి నుంచి శుభప్రదమైన శ్రావణం మరూ కానుంది. ఈ మాసం వస్తూనే పండుగలను తీసుకురావడం ప్రత్యేకత.

8లో▸

35 మంది ఏఈవోల బదిలీ

ఆదిలాబాద్‌టౌన్: రైతురుణ మాఫీ కారణంగా వ్యవసాయశాఖలో బదిలీలు ఆలస్యమయ్యాయి. ప్రభుత్వం రెండు రోజులుగా బదిలీల ప్రక్రియ చేపడుతుంది. జిల్లాలో 101 మంది ఏఈవోలు పనిచేస్తుండగా 35 మందికి బదిలీ అయినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య తెలిపారు. జిల్లా నుంచి ముగ్గురు ఇతర జిల్లాలకు బదిలీ కాగా, ఆయాప్రాంతాల నుంచి ఇద్దరు జిల్లాకు వచ్చినట్లు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
32.0/16.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

డీడీ.. పంపిణీలో జాప్యం!



లబ్ధిదారుకు పంపిణీ చేసిన డీడీ

తాంసి: దళితబస్తీ లబ్ధిదారులకు పంట పెట్టుబడి సాయం డీడీలను భీంపూర్‌లో ఆదివారం పంపిణీ చేశారు. తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన 54 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా అధికారులు అందజేశారు. ఈ డీడీల గడువు ఈ నెల 5వ తేదీతో ముగియనుంది. అయితే వీటిని మే 7న జారీ చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా లబ్ధిదారులకు పంపిణీలో తీవ్ర జాప్యం అయింది. డీడీ కాలపరిమితి ముగిసే ఒక రోజు ముందుగానే అందజేయడం గమనార్హం. సోమవారం తప్పనిసరిగా బ్యాంకుకు తీసుకెళ్లి నగదు తీసుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు ఈడీ శంకర్ లబ్ధిదారులకు సూచించారు. అధికారుల తీరుపై లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు.

'ఎన్నికల హామీలు నెరవేర్చాలి'

ఎదులాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చడంతో పాటు కార్మికులకు అండగా నిలవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పంచాయతీ, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ఐకేపీ సిబ్బందికి కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలన్నారు. అలాగే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, దినసరి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, నాయకురాలు సునీత తదితరులు ఉన్నారు.



రిమ్స్ ఆస్పత్రి

వైద్యం.. దైన్యం!

- మావల మండలానికి చెందిన ఓ యువకుడికి ప్రమాదవశాత్తు తల, శరీర భాగాలకు గాయాలయ్యాయి. దీంతో కుటుంబీకులు ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో రిమ్స్‌కు తీసుకొచ్చారు. ఎమర్జెన్సీ వార్డులో జూనియర్ డాక్టర్లు తప్ప ఇతరే వైద్యులు అందుబాటులో లేరు. జూడాలు అందించిన చికిత్స తర్వాత వారు ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు.
- తాంసి పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. 10 గంటల తర్వాతే ఒక్కొక్కరు విధులకు హాజరవుతున్నారు. అంతక ముందు ఎవరైనా అత్యవసర వైద్య సేవల నిమిత్తం వస్తే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. గత్యంతరం లేక జిల్లా కేంద్రంలోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. మరికొంత మంది స్థానిక ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

- సర్కారు వైద్యం పేదలకు అంతంతే..
- రూ.లక్షల్లో వేతనం.. అయినా ప్రైవేట్ బాగోతం
- రోగుల ఇబ్బందులు పట్టించుకోని రిమ్స్ వైద్యులు
- జూడాలు, మెడికోలతోనే నెట్టుకొస్తున్న వైనం
- పీహెచ్‌సీల్లోనూ ఇదే పరిస్థితి

ఆదిలాబాద్‌టౌన్: వైద్యో నారాయణ హరి.. కళ్ల ముందే కనిపించే వైద్యులను రోగులు దేవునిగా భావిస్తారు. అంతటి ప్రాముఖ్యత ఉన్న వైద్య వృత్తికి కొందరు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారు. కాసులకు కక్కుర్తి పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రిమ్స్, సర్కారు ఆస్పత్రుల్లో రూ.లక్షలాది వేతనం తీసుకుంటూ విధులకు ఎగనామం పెడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయడం కంటే తాము ఏర్పాటు చేసుకున్న క్లీనిక్‌కే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఉదయం 10 దాటితే కానీ విధులకు హాజరు కారు.. మధ్యాహ్నం ఒంటిగంట అయిందంటే వైద్యులు ఆస్పత్రిలో కనిపించరంటే అతిశయోక్తి కాదు. దీంతో సర్కారు వైద్యంపైనే ఆధారపడి రిమ్స్, ఆయా పీహెచ్‌సీలకు వస్తున్న పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. అత్యవసర సమయం లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోయినట్టే. సెలవు రోజుల్లోనైతే పరిస్థితి మరీ అధ్వానంగా మారుతోంది. ఆదివారమైతే సెలవుగా భావిస్తున్నారు. దీంతో జూనియర్ డాక్టర్లు, మెడికోలతోనే రిమ్స్‌ను నెట్టుకొస్తున్నారు. కొన్ని పీహెచ్‌సీల్లో సైతం వైద్యులు మధ్యాహ్నం వరకే ఉండి ఇంటిబాట పడుతున్నారు. అసలే వ్యాధుల కాలం, మరోవైపు రోగులతో ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అసలే ఖాళీలు.. ఆపై అరకొర విధులు

- రిమ్స్‌లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ఆసుపత్రిలో 148 వైద్యులకు గాను 85 మంది పనిచేస్తున్నారు. 63 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే రోగులు ఇబ్బందులు పడుతుండగా, ఉన్న వైద్యులు విధులకు ఎగనామం పెడుతుండడంతో వారి అవస్థలు వర్ణనాతీతం. బయోమెట్రిక్ హాజరు ఉన్నప్పటికీ విధులకు డుమ్మా కొడుతున్నారనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆసుపత్రిలో మధ్యాహ్నం ఒకట్రెండు తప్పితే మిగతా వార్డుల్లో ఎక్కడా వైద్యులు కనిపించని పరిస్థితి.
- ఇక సూపర్ స్పెషాలిటీలో 52 పోస్టులకు గాను 16 మంది పనిచేస్తున్నారు. 36 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ కూడా మధ్యాహ్నం తర్వాత అదే పరిస్థితి.
- రిమ్స్‌లోని ఎమర్జెన్సీ వార్డులో ట్యూటర్లు, జూనియర్ డాక్టర్లు, మెడికోలు మాత్రమే కనిపిస్తారు. సీనియర్ వైద్యులు ఎక్కడా దర్శనమివ్వడం లేదని రోగులు పేర్కొంటున్నారు. అత్యవసరమైన కేసుల్లో సీనియర్ వైద్యులకు సమాచారం అందిస్తే ఫోన్ ద్వారానే జూడాలకు వైద్యసేవలను వివరించడం గమనార్హం.

ప్రైవేట్ క్లీనిక్‌లకే ప్రాధాన్యత..

జిల్లా కేంద్రంలో దాదాపు 30వరకు ప్రైవేట్ క్లీనిక్‌లు ఉన్నాయి. వీటిలో దాదాపు రిమ్స్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులవే. మొదట్లో చిన్న ఓపీ క్లీనిక్ ఏర్పాటు చేసి ప్రస్తుతం మూడు నాలుగంతస్తుల భవనాల్లో ఆస్పత్రులను కొనసాగిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాల్సిన వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రిమ్స్‌లో పనిచేసే ట్యూటర్‌కు రూ.50వేల వరకు వేతనం ఉండగా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1లక్ష 25వేల వరకు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1లక్ష 50వేల వరకు, ప్రొఫెసర్‌కు రూ.2లక్షల వరకు వేతనం ఉంటుంది. వీరితో పాటు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, అర్బన్‌హెల్త్ సెంటర్లలో పనిచేసే వైద్యులకు సైతం లక్షల్లో వేతనాలు ఉంటున్నాయి. ప్రభుత్వం నుంచి ప్రతినెలా ఇలా లక్షలాది రూపాయల వేతనాలు తీసుకుంటున్నప్పటికీ పేదలకు మాత్రం వైద్యం అందించడంలో ఆసక్తి చూపడం లేదనే విమర్శలున్నాయి. కొంత మంది వైద్యులు అసలే పేదల వైద్యానికి ప్రాధాన్యతనివ్వకపోగా, మరికొంత మంది తమవద్దకు వచ్చిన వారిని వారి సొంత ఆస్పత్రులకు రావాలని సూచిస్తుండటం గమనార్హం. రిమ్స్‌తో పాటు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో పనిచేసే చాలా మంది వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్నారు. వారి విధులు ముగించిన తర్వాత అక్కడ వైద్యం అందిస్తున్నారంటే అది కాదు.. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి వరకు ప్రైవేట్ క్లీనిక్‌లు నడుస్తూనే ఉంటాయి. రిమ్స్‌లో రోగులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ వైద్యులకు మాత్రం వారి బాధ పట్టదు. ఇక్కడ లక్షల్లో జీతం తీసుకుంటూ ప్రైవేట్‌లో అదనంగా జేబులు నింపుకుంటున్నారు. అది చాలదన్నట్టు వాటికి అనుబంధంగా మెడికల్, ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. చిన్నపాటి జబ్బులకు సైతం వేలాది రూపాయల టెస్టులు, స్కానింగ్, ఎక్స్‌రే తదితరవి చేయాలని చెబుతున్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు



రిమ్స్‌లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీ కోసం ఈనెల 6న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాం. సమయపాలన పాటించని వైద్యులపై చర్యలు తీసుకుంటాం. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నాం. ఏవైనా ఇబ్బందులు ఉంటే నా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తా. – జైసింగ్ రాథోడ్, రిమ్స్‌డైరెక్టర్

రోడ్డు బాగుంటే ఆమె బతికేదేమో..?

- పాముకాటుకు గురైన న్యూసోమార్‌పేట్ యువతి
- బురద మార్గంలో ఆసుపత్రికి తరలింపు ఆలస్యం
- సకాలంలో చికిత్స అందక మృతి



గ్రామానికి వెళ్లే మార్గంలో వాగు వద్ద రోడ్డు ఇలా..

గుడిహత్నూర్: పాముకాటుకు గురైన ఆ యువతిని ఆసుపత్రికి తరలించడంలో జాప్యమైంది. ఇందుకు ఆ ఊరి బురదరోడ్డూ ఓ కారణమైంది. అంబులెన్స్ వచ్చే దారి లేక ఓ ప్రైవేట్ వాహనంలో ఇబ్బందుల నడుమ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆమె తనువు చాలించింది. ఈ ఘటన గుడిహత్నూర్ మండలంలో చోటు చేసుకుంది. రోడ్డు బాగుండి సకాలంలో వైద్యం అంది ఉంటే తమ బిడ్డ బతికి ఉండేదని తల్లిదండ్రులు పేర్కొనడం గమనార్హం. మండలంలోని న్యూసోమార్‌పేట్ గ్రామానికి చెందిన సిడాం గిరిజాబాయి–భీంరావ్ దంపతుల పెద్ద కుమార్తె లక్ష్మి (26) శనివారం రాత్రి సమయంలో పాముకాటుకు గురైంది. ఆమెకు నెలసరి రావడంతో వారి ఆచారం ప్రకారం ఇంటి పక్కన ఉన్న విడిది (కుప్పి)లో నిద్రించింది. ఈ క్రమంలో పాము కాటువేయగా తెల్లవారుజామున విషయం తల్లికి చెప్పింది. అప్పటికే ఆమెపై విషం ప్రభావం చూపుతోంది. బురద రోడ్డు కారణంగా ఊరికి అంబులెన్స్ వచ్చే సదుపాయం లేదు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే ఆమెను ఓ ఆటోలోఆసుపత్రికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. ముందుగా ఇంటి నుంచి సమీపంలో ఉన్న వాగు వరకు ఎత్తుకొని తీసుకువచ్చారు. అక్కడి నుంచి బురదదారిలో ఆటోలో రిమ్స్‌కు తీసుకెళ్లారు. ఊరి నుంచి ఆసుపత్రికి సుమారు 13 కిలోమీటర్లుండగా రెండు గంటలకు పైగా సమయం పట్టింది. రిమ్స్‌కు చేరిన తర్వాత పరీక్షించిన జూనియర్ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు.స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వైద్యం అందడంలోనూ జాప్యమైందని తల్లిదండ్రులు ఆరోపించారు. రోడ్డు సౌకర్యం ఉండి, సకాలంలో వైద్యం అంది ఉంటే తమ బిడ్డ బతికేదని వారు పేర్కొన్నారు.

రహదారి నిర్మించాలని గ్రామస్తుల ఆందోళన

బోథ్: తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గుట్టపక్కతండా గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అంతర్రాష్ట్ర రహదారి నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న తమ గ్రామానికి ఉన్న రోడ్డు బురదమయంగా మారిందని పేర్కొన్నారు. వానాకాలంలో నడక నరకప్రాయంగా ఉంటుందని, ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని దుస్థితి అని పేర్కొన్నారు. ఇప్పటికే పలువురు విద్యార్థులు జారిపడి గాయాల పాలయ్యారన్నారు. మహిళలు, విద్యార్థులు సైతం అక్కడికి చేరుకొని రోడ్డుపై బైఠాయించారు. దాదాపు గంట పాటు ఆందోళన చేపట్టడంతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై రాము అక్కడికి చేరుకుని వారిని శాంతింపజేశారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇందులో గ్రామస్తులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులను శాంతింపజేస్తున్న ఎస్సై రాము

కప్పర్లలో 'పిల్లల మొహర్రం'



పండుగలు, సంప్రదాయాల విషయంలో పిల్లలు పెద్దలను అనుకరిస్తూ ఉంటారు. ఇటీవలే మొహర్రం పండుగ అయిపోయిన విషయం తెలిసిందే. మండలంలోని కప్పర్లలో చిన్నారులు అచ్చం పీరీలను పోలినట్లే చిన్న సవారీలను కట్టుకొని ఇలా ఆదివారం సందడి చేయడం కనిపించింది.

– తాంసి

స్వచ్ఛదనం.. పచ్చదనం

- కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం
- నేటి నుంచి ఈనెల 9వరకు..
- అమలుకు ప్రత్యేక కమిటీలు
- మార్గదర్శకాలు విడుదల



స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం అమలుపై ఇటీవల సమీక్షిస్తున్న కలెక్టర్ రాజర్షి షా(ఫైల్)

కైలాస్‌నగర్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన ప్రమాణాలతో పాటు పచ్చదనం పెంపొందించాలని, పారిశుధ్యం నిర్వహణతో సీజనల్ వ్యాధులు కట్టడి చేయాలని, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నేటి నుంచి ఈనెల 9వ తేదీ వరకు అన్ని గ్రామపంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఇటీవల విడుదల చేసింది. ఇందులో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములను చేయాలని నిర్ణయించింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

పారిశుధ్యం, స్వచ్ఛనీటిపై ఫోకస్

జిల్లాలోని ప్రతీ గ్రామపంచాయతీతో పాటు మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో ఐదురోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో నిర్వహించాల్సిన కార్యక్రమాలివీ..

- ఈ నెల 5న స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువకులు, వార్డు కమిటీ సభ్యులు సమావేశమై గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించాలి. వీధి కుక్కల నియంత్రణ, ఇళ్లలో పోగైన చెత్త సేకరణ, పారిశుధ్యం, మొక్కల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల కట్టడి, ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై చర్చించాలి. వార్డులతో పాటు పబ్లిక్ ప్రదేశాలను పరిశుభ్రంగా మార్చాలి. ప్రభుత్వరంగ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, వసతిగృహాలు, పీహెచ్‌సీలు, బస్టాప్‌లను శుభ్రం చేయాలి. చెత్త సేకరించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చాలి. ప్లాస్టిక్ వినియోగం నియంత్రించేలా ప్రజలను చైతన్యవంతం చేసేదిశగా వాల్ పెయింటింగ్ చేయించాలి. వ్యక్తిగత మరుగుదొడ్డి లేని ఇంట్లో 15రోజుల్లో నిర్మించుకునేలా చూడాలి.
- 6వ తేదీన తాగునీటి వనరులను శుభ్రం చేయాలి. తాగునీటి వనరులు, సరఫరా, మధ్య పాయింట్లలో క్లోరినేషన్ శాతాన్ని పరిశీలించేలా నీటిని పరీక్షించాలి. శివారు ప్రాంతాలు, మురికివాడల్లో తాగునీటి పరిస్థితిని పరిశీలించాలి. ఇంకుడుగుంతలు లేని 300 చదరపు అడుగుల్లో నిర్మించిన నివాస గృహాలను గుర్తించాలి. చెరువులు, నీటి కుంటలను సందర్శించి నీటి సంరక్షణకు అనుసరించాల్సిన విధానాలపై చర్చించాలి.
- 7వ తేదీన డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడిక తొలగించాలి. కాలనీల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి. రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చాలి. వర్షపు నీటిని ఒడిసి పట్టేలా సామూహిక ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలి. పబ్లిక్ సంస్థలు, ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలి.
- 8న డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్‌హెచ్‌జీలు, ఆశా కార్యకర్తలు పాఠశాలల్లో ప్రార్థన సమయాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలి. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెల్త్ వర్కర్స్ ప్రజలకు వివరించాలి. అన్ని గ్రామపంచాయతీల్లో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జ్వరాల సర్వే చేపట్టాలి. పట్టణ ప్రాంతాల్లో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్లు లేనట్లయితే వాటిని మంజూరు చేసి పూర్తి చేసేలా చూడాలి. పంచాయతీ కార్యదర్శులతో పశుసంవర్ధక శాఖ అధికారులు సమన్వయం చేసుకుని గ్రామపంచాయతీ, మున్సిపల్ ప్రాంతాల్లో కుక్కల బెడదను నియంత్రించాలి.
- 9వ తేదీన ప్రతీ శుక్రవారం డ్రైడేగా నిర్వహించి గ్రామపంచాయతీ, పట్టణ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను పరిశుభ్రం చేయాలి. దోమల నిల్వకు ఆస్కారమయ్యే టీ కప్పులు, షూ, బాటిళ్లు, టైర్లు, కంటైనర్లు తదితరాలను శుభ్రం చేయాలి. స్క్రాప్ దుకాణాలు, పంక్చర్ షాపులను తనిఖీ చేసి దోమ లార్వాలు లేకుండా చూడాలి. పాఠశాలలు, అంగన్‌వాడీలు, పీహెచ్‌సీలు, బస్టాప్‌లు, క్రీడా మైదానాలు, పైకప్పు శుభ్రంగా ఉండేలా చూడాలి. శిథిల భవనాలు, కూలిపోయే స్థితిలో ఉన్న వృక్షాలు, కొమ్మలను తొలగించాలి.

నిర్వహణకు ప్రత్యేక కమిటీలు

స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ ప్రత్యేకాధికారి, కార్యదర్శి, ఆశ కార్యకర్తతో పాటు ఎస్‌హెచ్‌జీ, యువజన సంఘాల్లోని ముగ్గురు సభ్యులను నియమించాలి. పట్టణ ప్రాంతాల్లో గెజిటెడ్ ర్యాంక్ కలిగిన వార్డు ప్రత్యేకాధికారి, రిసోర్స్ పర్సన్, ఏఎల్ఎఫ్ అధ్యక్షురాలు, వార్డు కౌన్సిలర్‌తో కమిటీ నియమించాలి. ప్రత్యేకాధికారి ఈ కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ కమిటీలు ప్రతీరోజు కార్యక్రమాల్లో భాగస్వాములై వాటిని నిర్వహించాల్సి ఉంటుంది. గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి కార్యక్రమ నిర్వహణ నివేదికను డీపీవోకు, మండల ప్రత్యేకాధికారి జెడ్పీ సీఈవోకు అందించాల్సి ఉంటుంది. జెడ్పీ సీఈవో, డీఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, డీపీవో అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థల) పర్యవేక్షణలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు గాను ఐఏఎస్ అధికారిని సైతం ప్రత్యేకాధికారిగా నియమించింది. అయితే కార్యక్రమ నిర్వహణ కోసం నయాపైసా నిధులు విడుదల చేయకపోవడం గమనార్హం.

మొక్కలకు జియో ట్యాగింగ్

గ్రామపంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లోని ప్రతీ వార్డుల్లో గుర్తించిన ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేలా వనమహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలి. అటవీ ప్రాంతాలతో పాటు రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలి. పాఠశాలలు, ఇతర పబ్లిక్ సంస్థల్లో మొక్కలు నాటాలి. ప్రతీ ఇంటికి ఆరు రకాల పూలు, పండ్ల మొక్కలు అందించి వాటిని నాటి సంరక్షించేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రమదానం ద్వారా పెద్ద ఎత్తున చేపట్టాలి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పార్కులను అధికారులు వేకువజామున సందర్శించాలి. మార్నింగ్ వాకర్స్‌తో సమావేశమై అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. బహిరంగ ప్రాంతాల్లో నాటిన మొక్కలను సంరక్షించేలా జియో ట్యాగింగ్ చేపట్టాలి.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల వాగు నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ని పట్టుకున్నట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. పక్కా సమాచారంతో కిష్టంపేటలో శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ట్రాక్టర్‌ని పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. యజమాని అక్రమ ఇసుక దందాకు పాల్పడుతున్నాడని, గతంలో ఈ ట్రాక్టర్‌ను పోలీసులు, మైనింగ్ అధికారులు పట్టుకున్నారని వివరించారు.

వాంకిడిలో..


పట్టుబడిన వాహనంతో పోలీసులు

వాంకిడి: మండలంలోని కనర్‌గాం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా జివితి గ్రామానికి చెందిన కపుల్ శ్యాంరావు డీసీఎం వాహనంలో ఇసుకను తరలిస్తున్నాడు. ఖమాన ఎక్స్‌రోడ్ సమీపంలో టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఉదయం తనిఖీ చేశారు. వాహనం పట్టుకుని, శ్యాంరావుపై కేసు నమోదు చేసి వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఎస్సై గంగన్న, పోలీస్ కానిస్టేబుల్ సంజీవ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కెరమెరి: మండలంలోని సాంగ్వి వాగు వంతెన వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కెలిబి గ్రామానికి చెందిన లోబడే నారాయణ బైక్‌పై కెరమెరికి వస్తున్నాడు. ఇందాపూర్‌కు చెందిన వాడై కుమార్ కెరమెరి నుంచి ఇందాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కెరమెరి పీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి


సలీం (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నేత సలీం విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందాడు. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. మండలంలోని హర్కాపూర్ గ్రామంలో తనకున్న సర్వీసింగ్ పాయింట్ వద్ద పనులు చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కుమారుడు సోఫియాన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలు తెలుసుకున్నారు.

శ్రావణం.. శుభప్రదం

- నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- ప్రతిరోజూ ప్రత్యేకతే
- నెలరోజులూ పూజలు, వ్రతాలు


వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు (ఫైల్)

మంచిర్యాలఅర్బన్/నేరడిగొండ: శ్రావణం..శుభప్రదం.. ఈ మాసం ఎంతో ప్రాముఖ్యత ఉంది. పౌర్ణమినాడు చంద్రుడు శ్రావణ నక్షత్రంలోకి సంచరించటం వల్ల శ్రావణమాసం పేరు వచ్చిందని వేదపండితులు చెబుతున్నారు. ఈ మాసం వస్తూనే పండుగలను తీసుకువస్తుంది. ఇక నాగుల పంచమి, రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, పొలాల అమావాస్య తదితర పండుగలు ఈ మాసంలో రావడం దీని ప్రత్యేకత. ఈనెలలో మహిళలు పూజలతో ఆలయాలు కిటకిటలాడనున్నాయి.

మార్కెట్‌లో సందడి..

ఈ మాసంలో మార్కెట్‌లో సందడి నెలకొంటుంది. నూతనవస్త్రాలు, ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తుంటారు. పట్టణంలోని పలు వస్త్ర దుకాణాల్లో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించి వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. పూలు, పండ్ల వ్యాపారులకు డిమాండ్ పెరగనుంది.

సోమవారం: ముక్కంటి ఈశ్వరునికి సోమవారం ఎంతో ప్రీతికరమైన రోజు. శివుడికి అభిషేకం చేసి పూజలు నిర్వహిస్తే స్వామి కటాక్షాన్ని పొందవచ్చు. అర్చనలు చేసి నమస్కరిస్తే సకల పాపాలు తొలగి శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

మంగళవారం: అభయమిచ్చే ఆంజనేయుడు..సకల విఘ్నాలు తొలగించి ముందుగా పూజలందుకునే విఘ్నేశ్వరుడు. సంతాన భాగ్యాన్ని కలిగించే సుబ్రహ్మణ్యేశ్వరుడు మంగళవారమే జన్మించారని పురాణాలు చెబుతున్నాయి. మంగళగౌరికి ప్రీతికరమైన రోజు. ఆయా దేవతలందరినీ భక్తిశ్రద్ధలతో పూజిస్తే శుభాలు కలుగుతాయని నమ్మకం.

బుధ,గురువారాలు: శ్రావణమాసంలో బుధవారం అయ్యప్ప స్వామికి, గురువారం రాఘవేంద్ర స్వామి, దక్షణమూర్తి, సాయిబాబాలకు ప్రీతికరమైన రోజులు. ఆయా దేవతలను, గురువులను దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం.

శుక్రవారం: శ్రావణమాసంలో వచ్చే ప్రతి శుక్రవారం ఎంతో ప్రాధాన్యం. వరలక్ష్మి వ్రతం ఆచరించే వారికి శుభప్రదమైన వారం. అమ్మవారికి కుంకుమార్చనలు, ఎర్రని పూలు, అల్లిన మల్లెల మాలను సమర్పిస్తే పాపాలు తొలగి రుణవిముక్తి, లక్ష్మీ కటాక్షం, సౌభాగ్యం సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

శనివారం: కలియుగదైవం శ్రీనివాసుడికి ఎంతో ప్రీతికరమైన రోజు శనివారం. ఉపవాస దీక్షలు చేపడతారు. స్వామివారికి పుష్పార్చనలు, తులసీదళల మాలలు సమర్పిస్తారు. ప్రతి శనివారం ఇలా చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

ముహూర్తాలు ఇలా..

మూఢంతో మూడు నెలలు శుభకార్యాలు నిలిచిపోయాయి. సోమవారం నుంచి సెప్టెంబర్ 3 వరకు శ్రావణమాసం కొనసాగనుంది. ఈనెల 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28, 30 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. మహిళలు ఇంటిటా ప్రత్యేక పూజలతోపాటు ఉపవాస దీక్షలు చేస్తారు. రెండో శుక్రవారం 16న వరలక్ష్మీ వ్రతం చేసుకుంటారు. అలా కుదరని వారు నాలుగవ శుక్రవారం 30న ఆచరిస్తారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో శ్రీలక్ష్మీదేవికి, ఆలయాల్లో పూజలు, వ్రతాలు, సామూహిక కుంకుమ పూజలుంటాయి.

సకల శుభాలు ఈమాసంలో..



శ్రావణమాసంలో భక్తితో భగవంతుడిని ఆరాధిస్తే సకల శుభాలు వరిస్తాయి. పండుగలు, పర్వదినాలకు నోములు, వ్రతాలకు అనువైన మాసం. సిరిసంపదలు ప్రసాదించమంటూ మహాలక్ష్మీని కొలిచే శ్రావణంలో శివశక్తిని పూజిస్తారు. శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన మాసం శ్రావణం.

– శంకర్, అర్చకుడు, మంచిర్యాల

శ్రావణం..భక్తి మాసం



శ్రవణ నక్షత్రమే వేంకటేశ్వరస్వామి అవతార నక్షత్రం. ఈ మాసాన్ని మహిళలు అత్యంత పవిత్రంగా భావిస్తారు. మంగళగౌరి వ్రతం, వరలక్ష్మీ వ్రతాలతో అమ్మవారిని కొలుస్తారు. దీక్షలు చేస్తారు. రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి వంటి పండుగలు ఈనెలలోనే వస్తాయి. అందుకే శ్రావణ మాసాన్ని భక్తిమాసంగా భావిస్తారు.

– ఎల్కూచి శ్రావణ్‌కుమార్ జోషి, పురోహితుడు, వడూర్

10న సత్యనారాయణ వ్రతం

బాసర: బాసరలోని శ్రీ పాపాహరేశ్వర ఆలయంలో ఈనెల 10న సామూహిక సత్యనారాయణ వ్రత పూజ నిర్వహించనున్నట్లు శ్రీ త్రిపుర వత్సలా రామసేవా సమితి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 37 మంది దంపతులు పాల్గొంటారని వివరించారు. (పూజకి కూర్చునే దంపతులు) పురుషులు కండువా తిలకధారణ/మహిళలు చీర గాజులు, మంగళహారతి, కలశం, పువ్వులు, పండ్లు తీసుకురావాలని పేర్కొన్నారు. వ్రత పూజలో పాల్గొనే వారు ఈనెల 8లోపు ఆలయంలో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జన్నారం: నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ కాలెండర్ విడుదల చేసిందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, నాయకులు రాజన్న, ఫసీఉల్లా, నందునాయక్, సతీశ్, కరుణాకర్, అజార్, మౌళానా, పాల్గొన్నారు.

తమ్ముడు మాట వినడం లేదని అన్న ఆత్మహత్య

- ఖానాపూర్ మండలం మస్కాపూర్‌లో ఘటన
- కేసు నమోదు


శివ (ఫైల్)

ఖానాపూర్: మద్యానికి బానిసై తమ్ముడు ఏ పనిచేయడం లేదని, తన మాట వినడం లేదని మనస్తాపంతో అన్న బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని మస్కాపూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం..పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన లోనికి సత్తవ్వ, పెంటయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు శివకుమార్ (33) మలేషియా వెళ్లి మూడు నెలల క్రితమే ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో కుటుంబీకులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. కాగా, తమ్ముడు రాకేశ్ ఇంటి వద్దే ఉంటూ జులాయిగా తిరుగుతున్నాడు. పలుమార్లు అతన్ని హెచ్చరించినా మార్పు రాలేదు. దీంతో శివకుమార్ మనస్తాపం చెంది శనివారం రాత్రి మస్కాపూర్ శివారులోని ఓ వేప చెట్టుకు తాడుతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గోదావరిలో రెండు మృతదేహాలు

- బాసర వద్ద కలకలం


గుర్తుతెలియని వృద్ధుడు, యువకుడి మృతదేహాలు

బాసర: బాసర వద్ద గోదావరి నదిలో ఆదివారం రెండు మృతదేహాలు కలకలం రేపాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో బయటకు తీయించారు. ఒకటి వృద్ధుడి మృతదేహంగా గుర్తించారు. వయసు 60 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మరో మృతదేహం యువకుడిదని, వయసు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని వెల్లడించారు. మృతదేహాల వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారం వ్యవధిలో నలుగురి మృతదేహాలు లభ్యం కావడం చర్చనీయంగా మారింది. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్ర నుంచి వరద వస్తుండడంతో మృతదేహాలు కొట్టుకొస్తున్నట్లు భావిస్తున్నారు.

ఐదు కిలోల గంజాయి పట్టివేత


నిందితుడితో పోలీసులు

ఇంద్రవెల్లి: మండలంలోని ఈశ్వర్‌నగర్ సమీపంలోని నర్సాపూర్ చౌక్ వద్ద బైక్‌పై ఐదు కిలోల గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఉట్నూర్ సీఐ మొగిలి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నార్నూర్ మండలం చోర్‌గాం గ్రామానికి చెందిన సాబ్లే బాక్సండ్‌సింగ్ 5 కిలోల గంజాయిని విక్రయించడానికి బైక్‌పై ఆదిలాబాద్ వెళ్తున్నాడు. పక్కా సమాచారంతో ఆదివారం తనిఖీ చేయగా గంజాయి లభించింది. స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎస్సై సునీల్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

గంజాయి విక్రయదారుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన సాహెర్‌ని పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహ రాష్ట్రలోని కిన్వట్ నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ చిన్న,చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నాడు. ఆదివారం తాటిగూడ ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో విక్రయిస్తుండగా పట్టుకుని 80 గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2వేలు ఉంటుందని తెలిపారు. ఒక్కో ప్యాకెట్ ను రూ.100కు విక్రయిస్తున్నాడని, 13 వరకు ప్యాకెట్లు ఆయన వద్ద లభ్యమైనట్లు పేర్కొన్నారు. పక్కా సమాచారంతో పట్టుకున్నామని ఎస్సై వివరించారు.

సుప్రీం తీర్పునకు వ్యతిరేకంగా అప్పీలు చేస్తాం


ధర్నా చేస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు



మాట్లాడుతున్న పసుల రామ్మూర్తి

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా అప్పీలు చేస్తామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలు పునరాలోచించాలన్నారు. ఈనెల 11,12 తేదీల్లో నిర్వహించే 'హలో మాల చలో ఢిల్లీ'కార్యక్రమానికి వేలాదిగా మాలలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్, నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా

తలమడుగు: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మండల అధ్యక్షుడు క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఎస్సీలు ఐక్యంగా ఉన్నప్పటికీ విడిగొట్టేందుకు వర్గీకరణ బిల్లు చేపట్టడం సరి కాదన్నారు. సుప్రీంకోర్టు ఆబిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవన్న, చంటి, గంగన్న, నారాయణ, వేణు, శ్రీనివాస్, అనంద్, మల్లేశ్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

దండేపల్లి: మాలల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని జైభీమ్ సైనికదళ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆసాది పురుషోత్తం అన్నారు. దండేపల్లిలో ఆదివారం మాలమహానాడు నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం దండేపల్లి మండల యువజన తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాపల్లి జీవన్, ఉపాధ్యక్షుడిగా తీగల జీవన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వినయ్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్, కార్యదర్శిగా వెంకటేశ్, సలహాదారుగా సాగర్ ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడు దయాకర్, నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


చౌదరి నవీన్ (ఫైల్)

దహెగాం: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఎస్సై కందూరి రాజు కథనం ప్రకారం.. కుంచవెల్లికి చెందిన చిప్ప సూరజ్‌కు ఎలక్ట్రికల్ షాపు ఉంది. చౌదరి నవీన్ (17)తో కలిసి సామగ్రి కొనుగోలు కోసం బైక్‌పై కాగజ్‌నగర్‌కు వెళ్లారు. తిరిగివస్తుండగా మండల కేంద్రం మల్లన్న ఒర్రె సమీపంలోని కల్వర్టు వద్ద ఆగి ఉన్న మరో బైక్‌ను అదుపుతప్పి ఢీకొట్టారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రైతుల సమాచారంతో 108 సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్సులో కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ చౌదరి నవీన్ మృతి చెందాడు. నవీన్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి చౌదరి తిరుపతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

వైన్స్‌లో చోరీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని రేణుక వైన్స్‌లో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షటర్ పగులగొట్టి చొరబడి కౌంటర్‌లో రూ.30 వేల నగదు, రూ.10 వేల విలువ గల మద్యాన్ని ఎత్తుకెళ్లారు. వైన్స్ ఎదుట సీసీ కెమెరాల్లో ముగ్గురు చోరీచేసినట్లు రికార్డు అయింది. వైన్స్ యజమాని ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

వాహనం బోల్తా

బోథ్: మండలంలోని గుట్టపక్కతండా సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై వాహనం బోల్తా పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని కిన్వట్ ప్రాంతానికి పార్సల్ సామాగ్రితో ఆదివారం వాహనం వెళ్తోంది. ఈ క్రమంలో అడవిపందులు అడ్డురావడంతో డ్రైవర్ వాహనం తప్పించే యత్నంలో అదుపుతప్పి బోల్తాపడింది. స్వల్ప గాయాలతో డ్రైవర్ బయటపడ్డారు.

కుక్కలదాడిలో చుక్కలదుప్పి మృతి

కాగజ్‌నగర్‌రూరల్: కుక్కల దాడిలో ఆదివారం చుక్కల దుప్పి మృతి చెందింది. మండలంలోని కడంబా అటవీ ప్రాంతం నుంచి కుక్కలు దప్పిని తరుముతూ భీమన్న ఆలయం వరకు వచ్చింది. ఆ సమయంలో కౌటాల మండలం బోదంపల్లికి చెందిన అనిల్ వాటిని తరిమివేశాడు. అటవీ అధికారులకు సమాచారం అందించారు. సకాలంలో వైద్యం అందకపోవడంతో దుప్పి మృతి చెందింది. ఎఫ్ఎస్ఓ సుభాన్‌గౌరీ, సిబ్బంది గణేశ్, మల్లేశ్, రాంచందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్ఆర్ఓ రమాదేవి తెలిపారు.

గ్రాట్యూటీ సర్వీస్ డబ్బులు చెల్లించాలి

జైపూర్: ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యతలు చేపట్టిన స్టీగ్ కంపెనీకి సబ్ వ్యవహరించిన కంపెనీలో పనిచేసిన కాంట్రాక్టు కార్మికులకు గ్రా ట్యూటీ సర్వీస్ డబ్బులు వెంటనే చెల్లించాలని హెచ్ఎంఎస్ ఎస్టీపీపీ ప్రధాన కార్యదర్శి విక్రమ్ తెలి పారు. జైపూర్‌లో ఆదివారం నిర్వహించిన హెచ్ఎంఎస్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఏళ్లు గడుస్తున్నా కార్మికులకు చెల్లించాలిసిన గ్రాట్యూటీ డబ్బులు చెల్లించకుండా సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రెండేళ్లుగా అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు సంపత్, సాయికృష్ణ, నాయకులు శ్రీధర్, మరేశ్, అజేయ్, అంజి పాల్గొన్నారు.

మళ్లీ.. కాలేజీ రోజుల్లోకి


రజతోత్సవంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఆనాటి అధ్యాపకులు

నిర్మల్: వారంతా ఎప్పుడో పాతికేళ్ల క్రితం కలిసి ఇంటర్ చదువుకున్న మిత్రులు. ఆ తర్వాత ఉన్నతవిద్య, ఉద్యోగాలు, పెళ్లిళ్లు, పిల్లలు.. ఇలా ఎవరితోవలో వారు సాగిపోయారు. సరిగ్గా 25 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. మళ్లీ..ఆనాటి తమ కాలేజీ రోజుల్లోకి వెళ్లారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో 1997–98లో ఇంటర్మీడియెట్ పూర్తిచేసుకున్న బ్యాచ్ పూర్వవిద్యార్థులు సరిగ్గా స్నేహితుల దినోత్సవమైన ఆదివారం స్థానిక మారుతీఇన్‌లో రజతోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎక్కడెక్కడో ఉంటున్న పాతమిత్రులంతా తరలివచ్చారు. ఇన్నేళ్లపాటు కలుసుకోని వారైతే.. ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన మిత్రులంతా కలిసి రోజంతా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన అప్పటి ప్రిన్సిపాల్ సాయన్నతో సహా గురువులను సన్మానించుకున్నారు. కార్యక్రమ సమన్వయకర్తలు మునిగెల సాయిప్రసాద్, అరుణ్, శ్రీహరి, సబిత, సంధ్య మిగతా మిత్రులు ఏర్పాట్లు చూసుకున్నారు.

కలుసుకున్న పూర్వ విద్యార్థులు


శ్రీరాఘవేంద్ర హైస్కూల్ పూర్వ విద్యార్థులు

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీరాఘవేంద్ర హైస్కూల్‌లో 2001–02 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అందరూ కలిసి ఒకరినొకరు ఆప్యాయతతో పలుకరించుకుని అలింగనం చేసుకుని చిన్ననాటి /జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి పాదాభివందనం చేశారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి బోజనం చేశారు.

ఆత్మీయ సమ్మేళనం


సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థులు

పాతమంచిర్యాల: నస్పూర్ మున్సిపాలిటీలోని సరస్వతి శిశుమందిర్‌లో 2002–03 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి వారు హాజరయ్యారు. ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. హెచ్ఎం ధూళిపాల కాశీ విశ్వనాథం, పూదరి సత్యనారాయణ, ఆచార్యులు పాల్గొన్నారు.

బస్సుకు తప్పిన ప్రమాదం



తాంసి: భీంపూర్ మండలం అర్లి(టి) సమీపంలో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి కరంజి(టి) గ్రామానికి ప్రయాణికులతో బస్సు వెళ్తోంది. అర్లి(టి) సమీపంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద బస్సు వెనుక టైర్ నట్లు ఊడింది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డుపై నిలిపివేశాడు. స్థానికుల సాయంతో టైర్ నట్లు బిగించి తీసుకెళ్లారు. అరగంట పాటు ట్రాఫిక్ ఏర్పడింది. ధనోర నుంచి కరంజి(టి) వరకు రోడ్డు గుంతలమయంగా మారడంతో టైర్ నట్లు ఊడినట్లు భావిస్తున్నారు.